అంధకారంలో నేషనల్ హైవే



గురజాడ వద్ద నేషనల్ హైవేపై వెలగని లైట్లు



తాడంకి అండర్‌పాస్ వద్ద కుంగిన రోడ్డు

- వెలగని లైట్లు
- తరచూ ప్రమాదాలు

పమిడిముక్కల: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి గండిగుంట నుంచి గోపువానిపాలెం వరకు అంధకారంగా మారింది. సంవత్సర కాలంగా హైవేపై లైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు.

అగాధంలా అండర్‌పాస్

తాడంకి అండర్‌పాస్ వద్ద అగాధంలా రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. రోడ్డు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. వర్షం పడితే నీరు నిలిచిపోతుంది. రోజుల తరబడి మురుగునీరు నిలిచి ఉండటంతో గుంతలు కనపడక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తాడంకి, గోపువానిపాలెం, మద్రివాడ గ్రామాల ప్రజలు నిత్యం అండర్‌పాస్ నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. అదేవిధంగా ఉయ్యూరు, మంటాడ, గురజాడ అండర్‌పాస్‌ల వద్ద కూడా వర్షం పడితే నీరు నిలిచి ఉంటోంది. మురుగునీరు పోయే మార్గం లేదు.

అధ్వానంగా సర్వీస్ రోడ్లు

నేషనల్ హైవే అధికారులు సర్వీస్ రోడ్ల నిర్వహణ పట్టించుకోవడం లేదు. రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు దట్టంగా పెరిగిపోయాయి. రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. నేషనల్ హైవే పక్కనే ఉయ్యూరు, గురజాడ ప్రాంతాల్లో చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దుర్గంధం వెదజల్లుతోందని వాహనదారులు తెలుపుతున్నారు.

రాత్రి వేళల్లో ప్రమాదాలు



నేషనల్ హైవేపై లైట్లు వెలగక అంధకారం అలముకొంది. మంటాడ నుంచి విజయవాడ, మచిలీపట్నం వెళ్లాలంటే రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నారు.

– కంభపు లక్ష్మయ్య, మంటాడ

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్



నేషనల్ హైవేపై సంవత్సర కాలంగా లైట్లు వెలగడం లేదని, సర్వీస్ రోడ్ల నిర్వహణ సరిగా లేదని, అండర్‌పాస్‌లు చెరువులా మారాయని గతంలో 'సాక్షి'లో వచ్చిన కథనం ఆధారంగా పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవే వారు విద్యుత్ బకాయిలు ఉన్నారని విద్యుత్ శాఖ వారు చెబుతున్నారు. ఒకరిపై మరొకరు చెప్పడం మినహా లైట్లు మాత్రం వెలగడం లేదు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అండర్‌పాస్‌ల వద్ద నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి.

– జంపాన శ్రీనివాసగౌడ్, మాజీ సర్పంచ్, గురజాడ

క్లుప్తంగా

పేదలకు అన్నదానం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారికి పాదరక్షలను అందజేశారు. ఈ కార్యక్రమాలను వల్లభనేని సుబ్బారావు, జానకమ్మ స్మారకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో చేపట్టారు. లయన్స్ చైర్మన్ పెరుమాళ్ల, లయన్స్ ప్రతినిధులు వైపీసీ ప్రసాద్, మూల్పూరి సుధ, జంగం మోహనరావు, పరంధామయ్య, పి.చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు గుడివాడకు చెందిన వైద్యురాలు గవిర్నేని రజినీ వైద్య పరీక్షలు చేశారు. దాతలు నర్రా గంగాధరరావు(వెస్టిండీస్), కొసరాజు బాపయ్యచౌదరి, వల్లభనేని రామకృష్ణ ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ శిబిరంలో 185 మందికి పరీక్షలు జరిగాయని లయన్స్ చైర్మన్ పెరుమాళ్లు తెలిపారు. లయన్స్ ప్రతినిధులు వైపీసీ ప్రసాద్, మూల్పూరి సుధ, జంగం మోహనరావు, పరంధామయ్య, పి.చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణ కాలుష్యం

గుడివాడ టౌన్: ప్లాస్టిక్ వాడకం పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణం అని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రబాబు అన్నారు. ఆదివారం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదాలు చేస్తూ ఏలూరు రోడ్డు, నెహ్రూచౌక్‌ల మీదుగా ర్యాలీ కొనసాగింది. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరుతూ జ్యూట్ సంచులను వ్యాపారులకు, ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అలియా బేగం, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ టీజే సతీష్‌చంద్ర, కో–ఆర్డినేటర్ జి.జీవన్ పాల్గొన్నారు.

అనుమానంగా సంచరిస్తే సమాచారం ఇవ్వండి

కూచిపూడి(మొవ్వ): గ్రామాల్లో అనుమానంగా సంచరించే వారి గురించి, తాళం వేసిన ఇళ్ల వద్ద అపరిచిత వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసు స్టేషన్‌కు గానీ, డయల్ 112కు వెంటనే సమాచారం అందించాలని కూచిపూడి ఎస్‌ఐ కేవీఎస్ విశ్వనాథ్ పేర్కొన్నారు. దసరా సెలవుల్లో ప్రజలు ఇంటిని వదిలి వేరే ఊర్లకు వెళితే సదరు సమాచారాన్ని పోలీసులకు అందించాలని తెలిపారు. దీంతో రాత్రి గస్తీ సమయాల్లో అలాంటి ఇళ్లపై నిఘా ఉంచుతామని పేర్కొన్నారు. డబ్బు, విలువైన ఆభరణాలు ఇంట్లో ఉంచి ఊర్లకు వెళ్లరాదని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

కార్మికుల పని గంటలు పెంచడం దారుణం



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ టౌన్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మికుల పనిగంటలు పెంచడం దుర్మార్గపు చర్య అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో కొనసాగుతున్న ఎనిమిది గంటల పనిని రోజుకు 13 గంటలుగా పెంచడం దుర్మార్గమన్నారు. ఇది శ్రమ దోపిడీ అన్నారు. ఈ అంశాన్ని వెనక్కు తీసుకోకపోతే కార్మికులు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. కొండ, ఎ. విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మకు పాల పొంగళ్ల సమర్పణ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో ఆదివారం సందడిగా మారింది. మహిళా భక్తులు పాల పొంగళ్లను పొంగించిన మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడె వెంకట విష్ణు మోహనరావు, ధర్మకర్తలు ఏర్పాట్లు చేశారు.

దసరా ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు



గుడివాడలో విద్యుద్దీపాలతో అలంకరించిన భీమేశ్వర స్వామి దేవస్థానం



గుడివాడలో ముస్తాబైన గౌరీశంకర స్వామి దేవస్థానం


పామర్రు: దేవీ శరన్నవరాత్రులు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. స్థానిక అంకమ్మ తల్లి ఆలయాన్ని మామిడి మండలతో, అరటి చెట్లు, కొబ్బరి ఆకులతో సుందరంగా అలంకరించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్ : దసరా మహోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. పట్టణంలో గౌరీశంకరపురంలోని శ్రీ గౌరీశంకరస్వామి వారి దేవస్థానం(చిన్న శివాలయం), బంటుమిల్లి రోడ్డులోని శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం, కాకర్ల వీధిలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం, బేతవోలులోని శ్రీ ఆనందేశ్వర స్వామి దేవస్థానంలో మహోత్సవాల ఏర్పాట్లు ఘనంగా చేశారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలో దసరా వేడుకలకు పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. నాట్యాచార్యుల ఇలవేలుపు శ్రీ రామలింగేశ్వర సమేత శ్రీ బాలా త్రిపుర సుందరిదేవి అమ్మవారి దసరా వేడుకలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో నిర్వహించే విధంగానే కూచిపూడి ఆలయంలో కూడా అమ్మవారికి అలంకరణలు కొనసాగుతాయని మండలి సభ్యులు పేర్కొన్నారు.



కూచిపూడిలో ఉత్సవాలకు సిద్ధమైన బాలా త్రిపుర సుందరీ అమ్మవారి ఆలయం



పామర్రులో విద్యుద్దీపాల వెలుగులో అమ్మవారి ఆలయం

వృద్ధులకు దుస్తుల పంపిణీ



పామర్రు: మానవత సేవా సంస్థ అధ్యక్షుడు ఎన్.త్రివిక్రమరావు ఆధ్వర్యంలో స్థానిక రామాంజనేయ కాలనీలో పేదలైన వృద్ధులకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మానవత జీవ కాల సభ్యుడు తన తండ్రి సీతారామయ్య జ్ఞాపకార్థం వృద్ధులకు వస్త్రాలను అందజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మానవత ప్రతినిధులు శీతాల ప్రసాద్, పీఎంఎస్ ప్రసాద్, రామారావు, కె రవీంద్ర, సుధాకర్, సోమశేఖర్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై విజయం సాధించాలి

పెనమలూరు: క్యాన్సర్‌పై పోరాటం చేసి విజయం సాధించాలని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ నజీర్ అన్నారు. కానూరులో రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పండ్లు, చిన్నారులకు బొమ్మలు అందజేశారు. వరల్డ్ రోజ్ డే సందర్భంగా ఆదివారం అమెరికన్ అంకాలజీలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడారు.

వైభవంగా మహాచండీ హోమం

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలోని పంచతత్వ గురుపాదుకా మందిరంలో ఆదివారం మహాచండీ హోమం నిర్వహించారు. తొలుత గురుపాదుకాలకు అభిషేకాలు, విశేష పూజలు జరిపారు. అనంతరం దత్తాత్రేయ స్వామివారికి తైలాభిషేకం చేశారు. ఆంజనేయ శర్మ, ప్రవీణ్‌శర్మ నేతృత్వంలో చంద్రశేఖర్ దంపతులచే మహాచండీ, మహా మృత్యుంజయ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతిని సమర్పించారు. ఆశ్రమ ట్రస్టీ గొంది రాజశేఖర్, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

రూ.3.5 కోట్లతో శ్రీకనకదుర్గ ఆలయ పునర్నిర్మాణం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో రూ.3.5 కోట్ల వ్యయంతో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని దాతల సహకారంతో పునర్నిర్మిస్తున్నట్లు దేవస్థానం అభివృద్ధి కమిటీ తెలియజేసింది. ఆదివారం దేవస్థానం ఆవరణలో విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. 250 గజాల స్థలంలో 30 అడుగుల ఎత్తులో అమ్మవారి రాతి గుడిని ఆగమశాస్త్ర ప్రకారం రాజమహేంద్రవరం శిల్పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆనాటి శిల్పకళానైపుణ్యంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. సుమారు 35 సంవత్సరాల క్రితం స్థానికులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారన్నారు. అదే స్థలంలో భక్తులు, దాతల సహకారంతో పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ గుంటక సంధ్యారాణి, కార్యదర్శి అంగజాల హనుమా, వైస్ ప్రెసిడెంట్ ఆర్.సీతారామారావు, యర్కారెడ్డి మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని, కమిటీ సభ్యులు దుంపల కృష్ణ, బాలాజీ నాయక్, రాంబాబు, దేవస్థానం అర్చకులు రొంపిచర్ల దత్తుకుమార్, సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

తెలుగు అడుగుజాడ గురజాడ

కలిదిండి(కైకలూరు): తెలుగు అడుగుజాడగా గురజాడ అప్పారావు ఎప్పటికీ కీర్తించబడతారని కలిదిండి శాఖ గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు పేర్కొన్నారు. గురజాడ జయంతి సందర్భంగా ఆదివారం గ్రంథాలయంలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి మాట్లాడుతూ గురజాడ తన రచనలతో వ్యవహారిక భాషలో తెలుగును అందరికీ అర్థమయ్యే విధంగా చైతన్య పరిచారన్నారు. కన్యాశుల్కం నాటకంతో వరకట్నం దురాచారంపై ఎత్తిచూపారన్నారు.



నేటి నుంచి వెంకన్న సన్నిధిలో నవరాత్రులు



విద్యుద్దీపాలతో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సమూహం

గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు శ్రీ భూ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి దసరా నవరాత్రుల మహోత్సవాలను నిర్వహించేందుకు ఆదివారం ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారని దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులు చెప్పారు. శ్రీ దేవి శరన్నవ రాత్రుల మహోత్సవాలకు అమ్మవార్ల అవతారాలకు ఏర్పాటు చేసే నవ రాత్రుల విశేష అలంకరణలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

అమ్మవారి అలంకారాలు

22న గాజులతో అలంకరణతో ఆదిలక్ష్మీ దేవి, 23న వరి, చెరకు అలంకరణతో ధాన్యలక్ష్మీ దేవి, 24న స్వర్ణ కవచం, స్వర్ణ ఆభరణాలతో అలంకరణతో ధైర్యలక్ష్మీ దేవి, 25న చందన అలంకరణతో గజలక్ష్మీ దేవి, 26న బొమ్మల అలంకరణతో సంతాన లక్ష్మీ దేవి, 27న మల్లి, కనకాంబరం పుష్పాలంకరణతో విజయలక్ష్మీ దేవి, 28న పూలంగి సేవ అలంకరణతో సౌభాగ్య లక్ష్మి దేవి, 29న సరస్వతి అలంకరణతో విద్యాలక్ష్మి దేవి, 30న చామంతి పువ్వుల అలంకరణతో వరలక్ష్మీ దేవి, వచ్చే నెల ఒకటో తేదీన తామర, కలువ అలంకరణతో మహాలక్ష్మీ దేవి, అక్టోబర్ 2న ధనలక్ష్మీ దేవిగా భక్తులకు అమ్మవారు దర్శనమివ్వనున్నారని తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

గుడివాడ టౌన్: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కైకాల సత్యనారాయణ కళామందిరంలో ఏర్పాటు చేసిన పారిశుద్ధ్య కార్మికుల వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల కృషి ఫలితంగా పట్టణంలో రోడ్లపై చెత్తవేయడం 90 శాతం తగ్గిపోయిందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్. మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత, డాక్టర్ జోగానంద్, డాక్టర్ జాన్ డేవిడ్, డాక్టర్ సుష్మ పాల్గొన్నారు.

నేడు బాలత్రిపుర సుందరీదేవిగా కొండలమ్మ దర్శనం



కొండలమ్మ మూలవిరాట్

గుడ్లవల్లేరు: దసరా నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారు సోమవారం భక్తులకు బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమివ్వనున్నారు. ఈ విషయాన్ని ఆ దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడె వెంకట విష్ణు మోహనరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ ఉత్సవాలను తెలియపరిచే పోస్టర్లు ముద్రించి, గుడివాడ నుంచి మచిలీపట్నం వరకు ప్రతి గ్రామములోనూ ఏర్పాటు చేసి ప్రచారం చేసినట్లు పేర్కొన్నారు.

కొండలమ్మకు ఎమ్మెల్యే రాము పట్టు వస్త్రాలు

సోమవారం కొండలమ్మ దసరా ఉత్సవాలకు కలశ స్థాపన కార్యక్రమం ఉంటుందని ఈఓ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని పేర్కొన్నారు.

పెద్దింట్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తులు



పెద్దింట్లమ్మ తల్లి

కైకలూరు: ఏలూరు జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సమీప జిల్లాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు సమర్పించారు. ఆలయ ప్రధాన ఉప అర్చకుడు పేటేటి పరమేశ్వరశర్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈఓ కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఆదివారం ఒక్క రోజు ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండన, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డూ ప్రసాదం, గదుల అద్దెలు, అమ్మవారి చిత్రపటాల విక్రయం, వాహన పూజలు, భక్తుల విరాళాల ద్వారా రూ.31,465 ఆదాయం వచ్చిందని తెలిపా. అమ్మవారి దేవస్థానంలో దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నామని, భక్తులు విరివిగా పాల్గొనాలని ఈఓ కోరారు.

అవార్డు గ్రహీత దేవానంద్‌కుమార్‌కు సత్కారం



దేవానంద్ కుమార్‌ను సత్కరించిన స్థానికులు

మండవల్లి: రాష్ట్రపతి అవార్డు గ్రహీత మెండా దేవానంద్‌కుమార్‌కు ఆదివారం స్థానిక నాగేంద్రస్వామి కల్యాణ మండపంలో అభినందన సభ నిర్వహించారు. దేశంలో నాలుగు లక్షలకు పైగా దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల్లో తెలుగు శాఖ అధ్యక్షుడు దేవానంద్‌కుమార్ జాతీయ స్థాయిలో 19వ స్థానంలో నిలిచి, ఈ నెల 5న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకున్నారు. దీనిని పురస్కరించుకుని దేవానంద్‌కుమార్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు, చేబోయిన వీర్రాజు, విజయ్‌కుమార్, కోటేశ్వరరావు, సత్తిబాబు, వెంకటేశ్వరరావు, బి గోకర్ణయాదవ్ పాల్గొన్నారు.

సొంత నిధులతో పంట కాలువ పూడికతీత



నందివాడ: మండలంలోని ఇలపర్రు పంచాయతీ పరిధిలో దోసపాడు చానల్ పంట కాలువలో తూడు కిక్కిస పెరిగిపోవడంతో ఆక్వా సాగు చేస్తున్న రైతులకు నీరు దిగువకు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆక్వాసాగు చేస్తున్నటువంటి ముదునూరి లింగరాజు తన సొంత నిధులతో ఆదివారం పంట కాలువలో పూడిక తీత పనులు చేపట్టారు.

నిత్యావసర వస్తువుల అందజేత

మండవల్లి: గన్నవరంలో రోడ్డు ప్రమాదంలో జీవనోపాధి కోల్పోయిన కూనపురెడ్డి పాండురంగ కుటుంబానికి ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిత్యావసర సరుకులు, రూ. 7 వేలు ఆర్థిక సాయం అందజేసింది. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సలహాదారులు, ఉమ్మడి కృష్ణా జిల్లా కెరీర్ గైడెన్స్ చైర్మన్ ప్రొఫెసర్ సూదాబత్తుల విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు కూనపురెడ్డి వెంకట బాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.